క్లుప్తంగా

పనితీరు మెరుగుపర్చుకోవాలి

భామిని: ఉపాధిహామీ పథకం సిబ్బంది పనితీరు మెరుగుపడాలని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు అన్నారు. ఏపీఓ తులసీదాస్ అధ్యక్షతన శనివారం ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మస్తర్ల నమోదులో అవకతవకలపై వస్తున్న ఫిర్యాదులపై వివరాలు సేకరించారు. పనికి హాజరైన వేతనదారులకు మాత్రమే మస్తర్లు నమోదు చేయాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, ఈసీ, టీఏలు, ఎఫ్ఏలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య



తుమరాడలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

పాలకొండ రూరల్: కార్పొరేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన బోధన అందుతోందని అధ్యాపకులు వెంకటేశ్వరరావు, వెలమల అప్పారావు తదితరులు స్పష్టం చేశారు. మండలంలోని తంపటాపల్లి, తుమరాడ, అంపిలి, వడమ ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లితండ్రులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, విద్యా బోధన, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరించారు. పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. అధ్యాపకులు శ్రీనివాసరావు, గిరిబాబు, శివానంద్ తదితరులున్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో 1998 డీఎస్సీ ద్వారా నియామకాలు పొందిన 33 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈఓ జె.నారాయణస్వామి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం 36 మందికి గాను 33 మంది విధుల్లో చేరారని, దీంతో మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరిందని, విద్యార్థులకు మెరుగైన విద్య అందనుందన్నారు.

డీఆర్ఎస్, గ్యాస్ గొడౌన్ తనిఖీ



డీఆర్ఎస్ నిల్వలపై ఆరా తీస్తున్న అసిస్టెంట్ రిజిస్టర్ ఆడిటర్ పి.ఇందిరలావణ్య

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో జీసీసీ ద్వారా నిర్వహిస్తున్న డీఆర్ఎస్ గొడౌన్‌తో పాటు ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను అసిస్టెంట్ రిజిస్టర్ ఆడిటర్ పి.ఇందిర లావణ్య శనివారం తనిఖీ చేశారు. డీఆర్ఎస్ నిల్వలను, సరఫరా, లావాదేవీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే జీసీసీ ద్వారా నిర్వహిస్తున్న పెట్రోల్ బంకును కూడా సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



ప్రయాణికులకు కరపత్రాలు అందిస్తున్న అగ్నిమాపక అధికారి, ఆర్టీసీ డీఎం తదితరులు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలను నియంత్రించే క్రమంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సంబంధిత శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన మార్కెట్ వద్ద ప్రజలకు ప్రమాదాల నియంత్రణపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటిని అదుపుచేసేందుకు తమ శాఖ పనితీరుపై ప్రత్యేక డెమో నిర్వహించారు. ఆర్టీసీ డిపోమేనేజర్ పి.వెంకటేశ్వరరావుతో కలిసి ప్రయాణికులకు కరపత్రాలు అందించారు. ప్రస్తుత వేసవిలో సమస్యలు తలెత్తితే తక్షణమే స్పందించాలని, అధికారులకు సమాచారం అందించాలన్నారు.

బీజేపీని సాగనంపుదాం..

పాలకొండ రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో దేశాన్ని అధోగతిపాలు చేస్తుందని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అన్నివర్గాల వారు సంఘటితం కావాలని కోరారు. శనివారం పాలకొండలో ప్రచారభేరి కార్యక్రమం చేపట్టారు. స్థానిక నగరపంచాయతీ నుంచి ఎస్.కె.రాజపురం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు దావాల రమణరావు మాట్లాడుతూ.. బీజేపీ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాస్వామ్య విధానాలను రద్దుచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హేమసుందర్, రమేష్, దుర్గారావు, కాద రాము, నారయణరావు తదితరులున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం..

ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దే అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేమని ప్రజలు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. పుట్టిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు అందరికీ అండగా నిలుస్తున్న జగనన్నను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు. గ్రామాలకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు హారతులతో స్వాగతం పలికి, ఇంటి గోడకు అతికించిన జగనన్న స్టిక్కర్‌ను తనివితీరా చూసుకుని ప్రజానీకం సంబరపడిపోతున్నారు. శనివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల దృశ్యమాలిక.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ: 16వ వార్డులో ఓ ఇంటికి జగనన్న స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్



గుమ్మలక్ష్మీపురం: కిత్తలాంబలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిసుల్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గరుగుబిల్లి: దళాయివలసలో ప్రభుత్వ పనితీరును వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: మంద్రుంగూడలో సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ ధర్మారావు, సర్పంచ్ కేశవరావు, తదితరులు



కొమరాడ: కుమ్మరిగుంటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ శరత్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతంపేట: పెద్దూరులో జగనన్నే మా భవిష్యత్ అంటున్న చిన్నారులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడండి

● హౌసింగ్ పీడీ రఘురాం

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న గృహనిర్మాణాలను సకాలంలో పూర్తిచేసి జిల్లాకే పాలకొండను తలమానికంగా నిలపాలని హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం అన్నారు. శనివారం స్థానిక జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక ఈఈ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ సిబ్బందితో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఈఈ టి.రమేష్, డీఈఈ పి.మోహనరావు మాట్లాడుతూ కాలనీలో 1,246 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాంచగా.. వారిలో 127 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారన్నారు. మరో 80 ఇళ్లు శ్లాబు లెవల్‌కు చేరుకున్నాయన్నారు. 136 శ్లాబు స్థాయిలో, 781 గృహాలు పునాదులు, శ్లాబుస్థాయి గోడల వరకు వచ్చాయని వివరించారు. మిగిలినవి పునాదుల లెవల్‌లో ఉన్నాయన్నారు. అలాగే సొంత స్థలాలు కలిగిన 222 మందిలో 40 మంది నిర్మాణాలు పూర్తి చేసినట్లు వివరించారు.



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న పీడీ రఘురాం

ఇప్పటివరకు పనులు ప్రారంభించిన వారిని గుర్తించి వారిని చైతన్యపర్చాలన్నారు. వచ్చేనెలలో మరింత పురోగతి సాధించేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పీడీ సూచించారు. పనులు పూర్తిచేసిన వారికి చెల్లించిన బిల్లులు, నిర్మాణదారులకు అందిస్తున్న మెటీరియల్, ఇతర సౌకర్యాల కల్పనపై ఏఈ మాధవరావు ఉన్నతాధికారులకు వివరించారు.

ఇంటర్‌లో కలుద్దాం..

గుమ్మలక్ష్మీపురం, భామిని, జియ్యమ్మవలస: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిసాయి. అన్ని కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అధికారులు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు పూర్తవడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ కేంద్రాల నుంచి బయటకు వస్తూ కనిపించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు సెలవులు ఇవ్వడంతో అందులో ఉంటున్న విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. ఇంటర్‌లో కలుద్దాం అంటూ మిత్రులకు వీడ్కోలు పలికారు.



గుమ్మలక్ష్మీపురం: పరీక్షలు పూర్తవడంతో సొంతూళ్లకు పయనమవుతున్న టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: నాడు–నేడు రెండో విడత పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని పెదగుడబ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను శనివారం ఆయన పరిశీలించారు. మండలంలో నాడు–నేడు మొదటి విడతలో 27 పాఠశాలలను అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రెండో విడతలో 31 పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు అవసరమైన సామాగ్రిని గుత్తేదారులకు సరఫరాచేయడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ తరహా బోధన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

ఉపాధి హామీ లక్ష్యాలను చేరుకోవాలి

పాలకొండ రూరల్: గ్రామభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నిర్దేశించుకున్న ఉపాధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని ఎం.సింగుపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేతనదారుల హాజరు, మస్తర్లను తనిఖీ చేశారు. సగటు వేతనం రూ.275 వచ్చేలా పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం జంపరకోట సచివాలయాన్ని సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న పౌరసేవలపై ఆరా తీశారు.



పాలకొండ రూరల్: జంపరకోట సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

కన్నపుదొరవలసలో..

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిపనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ శనివారం పరిశీలించారు. పని ప్రదేశాలపై వసతులపై ఆరా తీశారు. ఎండలు అధికంగా ఉన్నందున టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం పూటల్లో పనులు చేయించాలన్నారు. మస్తర్లు తప్పుగా నమోదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిట్టుబాటు వేతనం వచ్చేలా చూడాలి

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు గిట్టుబాటు వేతనం లభించేలా చూడాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సిబ్బందికి సూచించారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో ముందుగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు నమోదు చేయాలన్నారు. బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ టి.రామకృష్ణనాయుడు, ఎఫ్ఏ పద్మావతి తదితరులున్నారు.

ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఉపాధిహామీ పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. ఉపాధిహామీ సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజుకు వేతనదారుకు రూ.272 వచ్చేలా పనులు చేయించాలన్నారు. భామిని, వీరఘట్టం మండలాల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం జరిగిన హౌసింగ్ సమావేశంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీలు రఘురాం, గణపతి, డ్వామా పీడీ రామచంద్రరావు, డీపీఓ సత్యనారాయణ, ఏపీడీలు రాధ, అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: కన్నపుదొరవలసలో ఉపాధిపనులను పరిశీలించి మస్తర్లు చూస్తున్న ఎంపీడీఓ రమేష్



గరుగుబిల్లి: పెద్దూరులో ఉపాధి వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

సీతంపేట: గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీడీఓ కొండపల్లి సత్యం కోరారు. సీతంపేట గ్రామ సచివాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటిపన్ను వసూలుతో పాటు పంచాయతీ ఆదాయ వనరుల పెంపుపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. తడి, పొడి చెత్తసేకరణ, కంపోస్టు తయారీపై సిబ్బందికి సూచనలు చేశారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటివరకు గ్రామాభివృద్ధికి చేపట్టిన పనులు, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, గ్రామకార్యదర్శి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

అభివృద్ధే సర్కారు లక్ష్యం

పాలకొండ రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. లుంబూరు సచివాలయం వద్ద శనివారం గ్రామ సభ నిర్వహించారు. గత ఏడాదిలో చేపట్టిన పనులు, రానున్న ఏడాదిలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో ఉప సర్పంచ్ పి.రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, క్షేత్రసహాయకులు రౌతు నారాయణరావు, నెల్లి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచు, అధికారులు

గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి

గరుగుబిల్లి: గ్రామసభల ద్వారా గ్రామస్తులకు ఉపయోగపడే అభివృద్ధి పనులను గుర్తించడంతో పాటు అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గొట్టివలస పంచాయతీలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ బి.చంద్రినాయుడు మాట్లాడుతూ.. గ్రామంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, వీఆర్ఓ ఆర్.రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లి: సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి భాస్కరరావు

సంఘ విద్రోహ చర్యలకు దూరంగా ఉండండి

పాచిపెంట: సంఘ విద్రోహ చర్యలకు యువత దూరంగా ఉండాలని పార్వతీపురం డీఎస్పీ సుభాష్ అన్నారు. కొటికిపెంట పంచాయతీ కొత్తవలసలో మన ఊరు మన పోలీస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుభాష్ మాట్లాడుతూ యువత పోలీసులతో స్నేహభావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో సారా అమ్మకాలు చేపడితే మహిళలు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

జియ్యమ్మవలస: భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకునేలా చూడాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బిత్రపాడు రైతుభరోసా కేంద్రంలో వీఏఏలు, ఏఈఓలకు భూసార పరీక్షలపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటించి భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి ఉన్నారు.




జియ్యమ్మవలస: భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఈ శ్రీనివాసరావు

మట్టినమూనాలు సేకరించాలి

గుమ్మలక్ష్మీపురం: నిర్దేశించిన లక్ష్యాల మేరకు మట్టి నమూనాలు సేకరించాలని ఏడీఏ నిర్మల జ్యోతి అన్నారు. ఇరిడి రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు అధ్యక్షతన వీఏఏలకు మట్టి నమూనాల సేకరణపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మట్టినమూనాల సేకరణ, భూసార పరీక్షలు, ఫలితాల విశ్లేషణ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించి మట్టినమూనా సేకరణ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

శాంపిల్ సేకరణ ముఖ్యం

భామిని: భూసారల పరీక్షల నిర్వహణలో మట్టి నమూనాల సేకరణ ఎంతో కీలకమని, సరైన అవగాహన లేకుండా నమూనాలు సేకరిస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని ఏఓ సింహాచలం అన్నారు. మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయ సహాయకులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అంతకుముందు మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, కమిటీ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, ఇ.మురళి, ఆరిక త్రినాథ్ పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ఇరిడి ఆర్బీకేలో వీఏఏకు సూచనలు చేస్తున్న ఏడీఏ నిర్మల జ్యోతి



భామిని: వీఏఏలకు మట్టి నమూనా సేకరణలో శిక్షణ ఇస్తున్న ఏఓ సింహాచలం

బోర్ల మరమ్మతులకు 'క్రాష్ ప్రోగ్రాం'



గుమ్మలక్ష్మీపురం: క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులకు క్రాష్ ప్రోగ్రాంను అమలు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబుతో కలిసి క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. పాడైన బోర్లను బాగు చేయించి వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటమే ఈ ప్రోగ్రాం ఉద్దేశమన్నారు. ఇందుకోసం సుమారు రూ.6 లక్షలతో మెటీరియల్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పారు. తొలిరోజు మండల కేంద్రంలో పాడైన బోర్లను బాగుచేశారు.

కురుపాం: తాగునీటి బోర్ల మరమ్మతుల కోసం చేపట్టిన క్రాష్ ప్రోగ్రాంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గొర్లి సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ వి.వి.శివరామప్పలో కలిసి శనివారం క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా మండలంలోని 23 పంచాయతీల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గ్రామాల్లో బోర్లు పాడైనట్లయితే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదిస్తే మెకానిక్‌లు వచ్చి బోర్లు బాగుచేస్తారన్నారు.

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ సురేష్ క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని శనివారం ప్రారంభించారు. మండలంలో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులకు రూ.6.10 లక్షలతో అవసరమైన సామగ్రి కొనుగోలు చేసినట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నాగేశ్వరరావు, ఏఈ భరత్‌చంద్ర ఉన్నారు.



కురుపాం: క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుజాత



జియ్యమ్మవలస: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్